సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
శనివారం। 16। సెప్టెంబర్। 2023





**తాళాలు పగులగొట్టి..**
అంగన్‌వాడీ సిబ్బంది సమ్మె చేస్తుండగా అధికారులు కేంద్రాల తాళాలు పగులగొట్టి లబ్ధిదారులకు పౌష్టికాహారం అందించారు. IIలో



**కొనసాగుతున్న వరద**
ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు తాలిపేరు, కిన్నెరసాని జలాశయాల్లో వరద నీరు వచ్చి చేరుతోంది. IVలో




**వాతావరణం**
జిల్లాలో శనివారం ఉష్ణోగ్రతలు కొంతమేర పెరుగుతాయి. మధ్యాహ్నం తర్వాత తేలిక పాటి వర్షం కురిసే అవకాశం ఉంది.

## న్యూస్‌రీల్

### రామయ్య ధగధగ..



అమ్మవారికి పుష్పాంజలి నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్ర స్వామివారు శుక్రవారం స్వర్ణ కవచధారణలో దర్శనమిచ్చారు. పసిడి కాంతులతో ధగధగలాడుతున్న రామయ్యను చూసి భక్తులు మురిసిపోయారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విష్వక్సేన పూజ, పుణ్యావాచనం గావించారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణ, యోక్త్రధారణ నిర్వహించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. అదేవిధంగా లక్ష్మీ తాయారు అమ్మవారి ఆలయంలో అమ్మవారికి పుష్పాంజలి నిర్వహించారు.

### పెద్దమ్మతల్లికి వైభవంగా పంచామృతాభిషేకం



అమ్మవారికి అభిషేకం చేస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లికి శుక్రవారం వైభవంగా పంచామృతాభిషేకం జరిపారు. శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయంలో శుక్రవారం అర్చకులు అమ్మవారి జన్మస్థలం వద్ద పంచామృతం, పసుపు, కుంకుమ, గాజులు, హారతి సమర్పించారు. అనంతరం ఆలయంలోని మూల విరాట్‌కు పంచామృతాలతో అభిషేకం, పంచ హారతులు, నివేదన, నీరాజనం, మంత్రపుష్పం తదితర పూజలు జరిపారు. కుంకుమపూజ, గణపతిహోమం గావించారు. ఈ కార్యక్రమంలో ఈఓ ఎస్.రజనీకుమారి, ఆలయ కమిటీ చైర్మన్ మహిపతి రామలింగం, సభ్యులు చందుపట్ల శ్రీనివాసరెడ్డి, చింత నాగరాజు, గంధం వెంగళరావు తదితరులు పాల్గొన్నారు.

### సీఎంను కలిసిన ఎమ్మెల్యే హరిప్రియ



సీఎం కేసీఆర్‌తో ఎంపీ కవిత, ఎమ్మెల్యే హరిప్రియ

ఇల్లెందు: హైదరాబాద్‌లో ప్రగతి భవన్‌లో సీఎం కేసీఆర్‌ను శుక్రవారం ఇల్లెందు ఎమ్మెల్యే హరిప్రియ కలిశారు. గృహలక్ష్మి పథకంలో గిరిజనేతరులకు రెండు వేల గృహాలు ఇవ్వాలని కోరగా, వెంటనే మంజూరు చేస్తూ ఉన్నతాధికారులను ఆదేశించారని ఎమ్మెల్యే తెలిపారు. కలెక్టర్‌కు సమాచారం అందించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె కేసీఆర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఆమెతో ఎంపీ కవిత తదితరులు ఉన్నారు.

# ఆధిపత్యపోరు..



**అప్పట్లో ఆదర్శ మున్సిపాలిటీగా కేటీఆర్ ప్రశంసలు**

- ప్రస్తుతం వర్గపోరుతో మసకబారుతున్న ప్రతిష్ట
- రెండు గ్రూపులుగా విడిపోయిన పాలకవర్గ సభ్యులు
- ఏడాది కాలంగా ఇల్లెందులో గాడితప్పిన పాలన

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: రెండేళ్ల కిందట రాష్ట్రంలోనే ఆదర్శ మున్సిపాలిటీగా ఇల్లెందు పేరు తెచ్చుకుంది. కానీ గడిచిన కొన్ని నెలలుగా చోటు చేసుకుంటున్న పరిణామాలతో ఈ ప్రతిష్ట మసకబారుతోంది. ఇల్లెందును చూసి నేర్చుకోవాలంటూ సాక్షాత్తు మున్సిపల్ మంత్రి కేటీఆర్ చేత పొగడ్తలు అందుకున్న దశ నుంచి మా గోడును పట్టించుకోండి మహాప్రభో అని మొరపెట్టుకునే స్థాయికి ఇక్కడ పరిస్థితులు దిగజారుతున్నాయి.

**అవార్డుల పంట**

ఇల్లెందులో ప్రస్తుతం కొలువైన పాలకవర్గం ఆరంభంలో అద్భుతాలు చేసింది. అభివృద్ధిలో పారిశుద్ధ్యంలో మునుపెన్నడూ పట్టణ ప్రజలు చూడనంత మార్పును తీసుకువచ్చింది. బుగ్గవాగు ప్రక్షాళన, షాపింగ్ కాంప్లెక్సుల నిర్మాణం, ప్రధాన రోడ్డులో జిగేల్‌మనే సెంట్రల్ లైటింగ్, ప్రధాన కూడళ్లలో ఫౌంటెన్లు ఇలా ఒక్కటేమిటి అన్నింటా ముందే అన్నట్టుగా ఇక్కడ పాలన సాగింది. అభివృద్ధి పనులపై ప్రత్యేకంగా సావనీర్ కూడా విడుదల చేశారు. రాష్ట్రస్థాయిలో జరిగిన మున్సిపల్ సమీక్షలు, బహిరంగ సభలతో పాటు ట్విట్టర్ (ఎక్స్) వేదికగా మంత్రి కేటీఆర్ ఇల్లెందులో చోటుచేసుకున్న సానుకూల మార్పులను స్వయంగా ప్రశంసించారు. పారిశుద్ధ్యం విషయంలో జాతీయ స్థాయిలో అవార్డులు దక్కాయి. కానీ ఇప్పుడదంతా గత చరిత్రగానే మిగిలిపోయే పరిస్థితులు నెలకొన్నాయి.

**మున్సిపాలిటీలో ముదిరిన వర్గపోరు**

గడిచిన ఏడాది కాలంగా ఇల్లెందు మున్సిపాలిటీలో వర్గపోరు ముదిరింది. చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, వైస్‌చైర్మన్ జానీపాషాలు రెండుగా గ్రూపులుగా చీలిపోయారు. కౌన్సిలర్లు చెరో శిబిరంలో చేరిపోయారు. పట్టణంలో జరిగే అభివృద్ధి పనుల్లో తమకు కనీస సమాచారం ఇవ్వడం లేదని, తమ ఉనికినే పట్టించుకోనట్టుగా చైర్మన్ డీవీ వ్యవహరిస్తున్నాడంటూ వైస్‌చైర్మన్ జానీపాషా వర్గం ఆరోపణలు చేసింది. అవిశ్వాసం కోసం ప్రయత్నాలు చేసింది. దీనికి బదులుగా డీవీ వర్గం నేతలు కౌంటర్లు ఇచ్చారు. దీంతో పరిస్థితి మరింతగా ముదిరింది. కౌన్సిలర్లతోపాటు నియోజకవర్గానికి చెందిన ఇతర బీఆర్‌ఎస్ నేతలకూ ఈ వర్గపోరు రగడ అంటుకుంది. దీంతో గడిచిన నెల రోజులుగా పార్టీలోని నేతలే ఒకరిపైఒకరు సోషల్ మీడియా వేదికగా దూషణలకు దిగారు. తనపై సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నారంటూ డీవీ కుటుంబ సభ్యులు, డీవీ తనను బెదిరించాడంటూ మరో నేత కృష్ణయ్య డీఎస్పీకి ఫిర్యాదు చేసుకున్నారు. ఈ వ్యవహారం సద్దుమణిగింది అనుకోగానే మున్సిపాలిటీ మేనేజర్ అంకుషావళిపై ఆరోపణలు వచ్చాయి. దానికి వైస్ చైర్మన్ కారణమంటూ ఇల్లెందు డీఎస్పీకి అంకుషావళి ఫిర్యాదు చేశారు. అంకుషావళిని మేనేజర్‌గా తొలగించాలంటూ జానీపాషా వర్గంవారు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఇలా ఒకరిపై ఒకరు పోటీలు పడుతూ మూడు ఆరోపణలు ఆరు ఫిర్యాదులు అన్నట్టుగా తగువులు పెట్టుకుంటున్నారు. ఆఖరికి మాజీ మావోయిస్టు కొడెం సమ్మయ్య మృతి, అంత్యక్రియల సందర్భంగా శవరాజకీయాలకు వెనుకాడని దుస్థితి ఇక్కడ నెలకొంది.

**ఎక్కడిపనులు అక్కడే**

మున్సిపాలిటీ పాలకవర్గంలో చోటుచేసుకున్న వర్గపోరు కారణంగా ఇల్లెందు ప్రగతి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టుగా మారింది. మోడల్ మార్కెట్ నిర్మాణ పనులు మధ్యలో నిలిచిపోయాయి. స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఎప్పుడు పూర్తవుతుందో తెలియని పరిస్థితి. ఇదే విధంగా షాపింగ్ కాంప్లెక్సులు, కమ్యూనిటీ సెంటర్లు, అంబేద్కర్ భవన్, బంజారా భవన్‌ల నిర్మాణ పనులు ఎప్పుడు కొలిక్కి వస్తాయో తెలియని గందరగోళం నెలకొంది. ఇటు ప్రజాప్రతినిధులు, అటు అధికారులెవరూ వీటిపై దృష్టి సారించడం లేదు. ఇటీవల బుగ్గవాగుకు రక్షణ గోడల నిర్మాణానికి రూ.9 కోట్లు మంజూరయ్యాయి. ప్రస్తుతం నెలకొన్న వర్గపోరు వాతావరణంలో ఆ పనులు ముందుకు సాగుతాయా లేదా అనే సందేహాలు నెలకొన్నాయి,

**పార్టీని ఫణంగా పెడుతున్నారు..**

పార్టీలోని నేతల మధ్య ఐక్యత లోపించడానికి ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ, ఆమె భర్త హరిసింగ్ వ్యవహారశైలినే కారణమని ఆ పార్టీవారే బహిరంగంగా చర్చించుకుంటున్నారు. నియోజకవర్గంలో తనను మించిన నాయకుడు ఎదగకూడదనే ఉద్దేశంతో ఒకరిపై ఒకరిని రెచ్చగొడుతూ అసమ్మతిని రాజేస్తున్నాడనే విమర్శలు హరిసింగ్‌పై వస్తున్నాయి. ఒక వ్యక్తి ఆధిపత్యం కోసం పార్టీ ప్రయోజనాలను ఫణంగా పెడుతున్నారని కారు పార్టీలో గుసగుసలు వినిపిస్తున్నాయి. రోజురోజుకు పార్టీకి నష్టం జరుగుతున్నా సరైన చర్యలు తీసుకోవడంలో పార్టీ అధిష్టానం విఫలమవుతోందన్న ఆవేదన గులాబీ కేడర్‌లో నెలకొంది.

**తెర వెనుక ఎవరు?**

మున్సిపల్ చైర్మన్‌గా ఎన్నికయ్యేందుకు భారీగా ఖర్చు జరిగిందనే నెపంతో ఆ మేరకు ఏకపక్షంగా డీవీ పనులు చేపడుతున్నాడనేది ఆయన వ్యతిరేక వర్గీయుల ప్రధాన ఆరోపణగా ఉంది. అందువల్లే మున్సిపాలిటీలో కౌన్సిలర్ల మధ్య సఖ్యత లోపించి వర్గపోరుకు దారి తీసిందంటున్నారు. దీనికి ప్రతిగా ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయడం సరికాదంటున్నారు డీవీ మద్దతుదారులు. మున్సిపల్ చైర్మన్ డీవీ వ్యవహార శైలినే వర్గపోరుకు కారణమైతే అసమ్మతి కేవలం మున్సిపాలిటీకే పరిమితం కావాలి కదా అని ప్రశ్నిస్తున్నారు. అలాకాకుండా కామేపల్లి, గార్ల, బయ్యారంలలో కూడా అసమ్మతి ఎందుకు చెలరేగిందంటూ తమ తరఫున వాదనలు వినిపిస్తున్నారు. జిల్లా పరిషత్ చైర్మన్ కోరం కనకయ్య, లక్కినేని సురేందర్, మేకల మల్లిబాబు యాదవ్, వడ్డమూడి దుర్గాప్రసాద్ వంటి వారు పార్టీని వీడటానికి కారణాలు విశ్లేషించాలని డిమాండ్ చేస్తున్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వేదికగా జరిగే కుట్రలే పార్టీలో వర్గపోరుకు కారణమంటూ ఆరోపణలు చేస్తున్నారు.

# ప్రశాంతంగా టెట్..





పాల్వంచరూరల్: హాల్ టికెట్లను పరిశీలిస్తున్న సిబ్బంది (ఇన్‌సెట్) కొత్తగూడెంలో పరిశీలిస్తున్న కలెక్టర్

- మొదటి పేపర్‌కు 83.82శాతం
- రెండో పేపర్‌కు 92.04 శాతం హాజరు
- పరీక్ష కేంద్రంలో కలెక్టర్ ప్రియాంక తనిఖీ

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలో శుక్రవారం నిర్వహించిన టెట్(టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్) ప్రశాంతంగా ముగిసింది. జిల్లాలో 37 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొదటి పేపర్‌కు 8,717 మంది హాజరుకావాల్సి ఉండగా, 7,307 మంది అభ్యర్థులు హాజరయ్యారు. 83.82 శాతం హాజరు నమోదైంది. 1,410 మంది గైర్హాజరు కాగా 16.18 గైర్హాజరు శాతం నమోదైంది. రెండో పేపర్‌కు 6,661 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా 6,131 మంది హాజరు కావడంతో 92.04 శాతం హాజరు నమోదైంది. 530 మంది గైర్హాజరు కావడంతో 7.96 శాతం గైర్హాజరు నమోదైంది. మొదటి పేపర్ ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, రెండో పేపర్ పరీక్ష మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించారు. అభ్యర్థులు సకాలంలో హాజరయ్యేలా అదనపు బస్సులను ఏర్పాటు చేశారు. నిరంతర విద్యుత్ సరఫరా ఉండే విధంగా చర్యలు తీసుకున్నారు. కేంద్రాల్లో సీసీ టీవీలు ఏర్పాటు చేశారు. 380 మంది ఇన్విజిలేటర్లు, 148 మంది హాల్ సూపరింటెండెంట్లు, 37 మంది శాఖాపరమైన అధికారులు, 37 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 9 మంది రూటు అధికారులు, 9 మంది ఫ్లయింగ్ స్క్వాడ్ విధులు నిర్వర్తించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు చేపట్టారు.

**కలెక్టర్ తనిఖీ**

కొత్తగూడెంరూరల్: జిల్లాలో శుక్రవారం టెట్(టీచర్స్ ఎలిజిబిలిట్ టెస్ట్) ప్రశాంతంగా నిర్వహించినట్లు కలెక్టర్ ప్రియాంక ఆల తెలిపారు. శుక్రవారం ఆమె లక్ష్మీదేవిపల్లి మండలం కృష్ణవేణి జూనియర్ కళాశాలలోని పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేశారు. పరీక్షకు హాజరైన అభ్యర్థుల వివరాలు చీఫ్ సూపరింటెండెంట్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 37 కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. ఎలాంటి ఇబ్బందులు రాకుండా పరీక్ష నిర్వహించిన సిబ్బందిని కలెక్టర్ అభినందించారు.

**సందర్శించిన అదనపు కలెక్టర్**

పాల్వంచరూరల్: మండల పరిధి లక్ష్మీదేవిపల్లిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల పరీక్ష కేంద్రంలో 240 మంది అభ్యర్థులు హాజరుకావాల్సి ఉండగా, 228 మంది హాజరయ్యారు. 12మంది గైర్హాజరయ్యారు. కొందరు అభ్యర్థులు పరీక్ష ప్యాడ్లు, చేతి గడియారాలు, షూస్, బ్యాగులను వెంట తెచ్చుకోగా, అధికారులు కేంద్రంలోకి అనుమతించలేదు. పరీక్ష కేంద్రాన్ని అదనపు కలెక్టర్ రాంబాబు, డీఎస్పీ వెంకటేష్, సీఐ వినయ్‌కుమార్‌లు పర్యవేక్షించారు. పలువురు చంటి పిల్లల తల్లులు, గర్భిణులు పరీక్షకు హాజరయ్యారు.

పాల్వంచ: పట్టణంలో ఆరు కేంద్రాలు ఏర్పాటు చేయగా 1,277 మంది అభ్యర్థులు టెట్ రాశారు. సీఐ వినయ్‌కుమార్, ఎస్‌ఐ రాము బందోబస్తు నిర్వహించారు.

బూర్గంపాడు: సారపాకలోని భద్రాచలం పబ్లిక్ స్కూల్‌లో నిర్వహించిన టెట్‌కు ఉదయం పరీక్షకు 184మంది, మధ్యాహ్నం పరీక్షకు 221మంది అభ్యర్థులు హాజరయ్యారు.

**ఐదుగురికి నిరాశ..**

భద్రాచలంటౌన్: పట్టణంలోని నన్నపనేని ఉన్నత పాఠశాలలో కేంద్రం ఏర్పాటు చేశారు. హాల్ టికెట్‌లో మాత్రం ఎస్‌ఎస్‌ఎం జెడ్పీహెచ్‌ఎస్ కొర్రాజుల గుట్ట అని ముద్రించారు. భద్రాచలం అని పేర్కొనలేదు. దీంతో ఐదుగురు అభ్యర్థులు పరీక్ష కేంద్రం వెతుకులాడి సుమారు గంట ఆలస్యంగా 10:30 గంటలకు రావడంతో అధికారులు అనుమతించలేదు. చిరునామాను అధికారులు పూర్తిస్థాయిలో ముద్రించకపోవడంవల్లే తాము పరీక్ష రాయలేకపోయామని అభ్యర్థులు వాపోయారు. కాగా పరీక్ష కేంద్రాలను అదనపు కలెక్టర్ రాంబాబు, డీఈఓ వెంకటేశ్వరాచారి తదితరులు పరిశీలించారు.

# ఓటర్లుగా నమోదు చేయాలి

**ఓటరు జాబితా పరిశీలకులు బాలమాయాదేవి**




మాట్లాడుతున్న పరిశీలకులు బాలమాయాదేవి

సూపర్‌బజార్(కొత్తగూడెం): అక్టోబర్ 1వ తేదీ నాటికి 18 సంవత్సరాలు నిండే ప్రతి ఒక్కరినీ ఓటర్లుగా నమోదు చేయాలని ఓటరు జాబితా పరిశీలకులు బి.బాలమాయదేవి అన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. గత నెల 21న ప్రకటించిన ముసాయిదా ఓటరు జాబితా ప్రకారం జిల్లాలో 9,28,983 మంది ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. 2018 నుంచి ఇప్పటివరకు 63,092 మంది నూతనంగా ఓటు హక్కు పొందారని పేర్కొన్నారు. కొత్తగా ఓటు నమోదుకు, చేర్పులు, మార్పులకు 60,335 దరఖాస్తులు రాగా, ఇప్పటికే 28 వేల అర్జీల విచారణ పూర్తి చేసినట్లు వివరించారు. జిల్లాలో గుర్తించిన 9,522 దివ్యాంగుల ఓటర్లను మార్కింగ్ చేసినట్లు తెలిపారు. కొండరెడ్డి కుటుంబాలకు 692 మందిని ఓటర్లుగా నమోదు చేసినట్లు వివరించారు. కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల మాట్లాడుతూ జిల్లాలో ఈ సంవత్సరం జనవరి నాటికి 9,28,941 మందికి ఎన్నికల గుర్తింపు కార్డుల జారీ ప్రక్రియ పూర్తయినట్లు తెలిపారు. నూతనంగా నమోదైన 53,470 మందికి గుర్తింపు కార్డుల జారీకి వర్క్ ఆర్డర్ ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఈ నెల 19 వరకు ముసాయిదా ఓటరు జాబితాలో అభ్యంతరాలను స్వీకరిస్తామని, వచ్చిన అభ్యంతరాలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్, అదనపు కలెక్టర్ రాంబాబు, కొత్తగూడెం, భద్రాచలం ఆర్డీఓలు శిరీష, మంగీలాల్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కాశయ్య పాల్గొన్నారు.

### పోలింగ్ బూత్‌ల పరిశీలన

ఇల్లెందు: పట్టణంలోని పలు పోలింగ్ బూత్‌లను శుక్రవారం ఓటరు జాబితా పరిశీలకులు బాలమాయాదేవి సందర్శించారు. సింగరేణి స్కూల్‌లో సౌకర్యాలను పరిశీలించారు. తహసీల్దార్ కె.రవికుమార్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

# ముహూర్తం ఖరారైంది..

**నేడు సోనియాగాంధీ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరనున్న తుమ్మల**



రాక్రేను సన్మానించిన తుమ్మల, పక్కన రేవంత్, భట్టి, పొంగులేటి, యుగేందర్, సాధు రమేష్‌రెడ్డి

సాక్షిప్రతినిధి, ఖమ్మం: మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ నేత తుమ్మల నాగేశ్వరరావు కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు ముహూర్తం కుదిరింది. పార్టీ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే సమక్షాన శనివారం ఆయన కాంగ్రెస్ కండువా కప్పుకోనున్నారు. సీడబ్ల్యూసీ సమావేశాలు హైదరాబాద్‌లో జరగనుండగా, 17వ తేదీన తుక్కుగూడలో విజయభేరి సభ నిర్వహిస్తున్నారు. అయితే సభకు ముందుగానే శనివారం తుమ్మల పార్టీలో చేరనున్నారు. అధిష్టానం ఆదేశాల మేరకు ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మాణిక్‌రావ్ ఠాక్రే, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, సీఎల్పీ నేత మల్లు భట్టివిక్రమార్క, ప్రచార కమిటీ కోచైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి శుక్రవారం హైదరాబాద్‌లోని తుమ్మల ఇంటికి వెళ్లి మర్యాదపూర్వకంగా కలిసి పార్టీలోకి ఆహ్వానించారు.

**ఉప ఎన్నికలో విజయం.. గత ఎన్నికలో పరాభవం**

ఉమ్మడి జిల్లాలో రాజకీయ ఉద్దండుడిగా పేరున్న తుమ్మల నాగేశ్వరరావు 2016లో పాలేరు ఉప ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థిగా భారీ మెజార్టీతో విజయం సాధించారు. ఆతర్వాత 2018 ఎన్నికల్లో ఓటమి చవిచూశారు. అనంతర రాజకీయ పరిణామాల్లో ఈ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ తరఫున గెలిచిన ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి బీఆర్‌ఎస్‌లో చేరారు. దీంతో పాలేరులో తుమ్మల రాజకీయ భవితవ్యంపై నీలినీడలు కమ్ముకున్నాయి. నియోజకవర్గవ్యాప్తంగా తుమ్మల, కందాల వర్గీయులు మధ్య ఘర్షణలు జరిగాయి. ఈక్రమంలో తమకే టికెట్ వస్తుందని ఇద్దరు నేతలు ధీమాగా ఉండగా... కందాలకే టికెట్ ప్రకటించారు. దీంతో తుమ్మల అనుచరులు ఆగ్రహంతో ఊగిపోయారు. గత నెల 25న ఖమ్మంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా 'ప్రజల ఆత్మగౌరవం.. అవసరం కోసం ఈ ఎన్నికల్లో పోటీ చేస్తా' అని తుమ్మల పేర్కొనగా, ఏ పార్టీలోకి వెళ్తారనే చర్చ సాగింది.

**వరుసగా నేతల కలయిక**

ఇటీవల టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, ప్రచార కమిటీ కోచైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మల్లు భట్టి.. తుమ్మలతో చర్చించారు. శుక్రవారం వీరంతా రాజధానిలోని తుమ్మల ఇంటికి ఠాక్రేతో కలిసి వెళ్లి పార్టీలోకి ఆహ్వానించారు. అనుచరులు కూడా కాంగ్రెస్‌లో చేరితేనే భవిష్యత్ ఉంటుందనే అభిప్రాయం వ్యక్తం చేయగా, తుమ్మల అటే మొగ్గు చూపారు.

**ముందు తుమ్మల ఒక్కరే..**

రెండు రోజుల పాటు రాజధానిలో జరిగే సీడబ్ల్యూసీ సమావేశాల్లో విరామ సమయంలో రాష్ట్ర వ్యాప్తంగా పలువురు నేతలను కాంగ్రెస్‌లో చేర్చుకునేలా అధిష్టానం నిర్ణయించినట్లు తెలిసింది. ఇందులో భాగంగా తుమ్మల కూడా పార్టీ కండువా కప్పుకోనున్నారు. శనివారం ఈ కార్యక్రమం పూర్తయ్యాక ఈనెల 17న తుక్కుగూడలో జరిగే విజయభేరి సభకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆయన అనుచరులను తరలించేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇక త్వరలోనే ఖమ్మం లేదా పాలేరులో భారీ సభ నిర్వహించి టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని ఆహ్వానించినట్లు తెలిసింది. ఆ సభలోనే తుమ్మల అనుచరులు కాంగ్రెస్‌లో చేరనున్నట్లు సమాచారం. ఈ విషయమై ఇప్పటికే ఆయన అనుచరగణానికి సమాచారం ఇచ్చినట్లు తెలిసింది.



# డయాలసిస్ కొందరికే..

- సర్వజన ఆస్పత్రిలో 48 మందికి రక్తశుద్ధి
- జిల్లా కేంద్రంలో మరో 40 మంది వెయిటింగ్
- చికిత్స పొందుతున్నవారు చనిపోతేనే మరొకరికి అవకాశం
- పాల్వంచకు మంజూరైన కేంద్రాన్ని రద్దు చేసిన ప్రభుత్వం
- ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్తే బాధితుల జేబులు ఖాళీ



జిల్లా కేంద్రంలోని సర్వజన ఆస్పత్రిలో రక్తశుద్ధి చేయించుకుంటున్న బాధితులు

కొత్తగూడెంరూరల్: జిల్లాలో ఐదు డయాలసిస్ కేంద్రాలు ఉన్నా బాధితులందరికీ వైద్యం అందడం లేదు. జిల్లా కేంద్రంలోని కేంద్రంలో రోజూ 20 మంది కిడ్నీ రోగులకు రక్త శుద్ధి చేస్తున్నా, ఇంకా 40 మంది రక్తశుద్ధి కోసం ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే శుద్ధి చేయించుకునేవారు ఎవరైనా చనిపోతే తప్పా వెయింటింగ్‌లో ఉన్నవారికి అవకాశం లభించదు. ఒక కిడ్నీ రోగి ప్రైవేట్ ఆస్పత్రిలో రక్తశుద్ధి చేసుకోవాలంటే రూ.3 వేలు ఖర్చవుతుంది. ప్రతీ రోగి నెలకు 8 సార్లు రక్త శుద్ధి చేసుకోవాల్సి ఉంటుంది. దీంతో సుమారు రూ. 24 వేలు ఖర్చు చేయాల్సి వస్తోంది. దీంతో ప్రభుత్వం డయాలసిస్ కేంద్రాలను అందుబాటులోకి తెచ్చింది. కొత్తగూడెం, భద్రాచలం, ఇల్లెందు, మణుగూరు, అశ్వారావుపేటలో ఐదు డయాలసిస్ కేంద్రాలు ఉన్నాయి. కాగా జిల్లా కేంద్రంలోని డయాలసిస్ కేంద్రంలో మాత్రం బాధితులు వెయిటింగ్‌లో ఉంటున్నారు.

**వెయిటింగ్‌లో 40 మంది**

2018 సంవత్సరంలో జిల్లా సర్వజన ఆస్పత్రిలో డయాలసిస్ కేంద్రం ఐదు పడకలతో ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు 220 మందికి 32 వేల సార్లు డయాలసిస్ నిర్వహించారు. ప్రస్తుతం 48 మందికి రోజు 20 మంది చొప్పున రక్తశుద్ధి చేస్తున్నారు. వెయిటింగ్‌లో మరో 40 మంది ఉంటున్నారు. రక్త శుద్ధి చేసుకోకపోతే ప్రాణాలకు ప్రమాదం వచ్చే అవకాశం ఉండటంతో ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లి జేబులు ఖాళీ చేసుకుంటున్నారు. బిల్లులు కట్టలేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పుడు చికిత్స పొందుతున్నవారిలో ఎవరైనా చనిపోతే తప్ప మరొకరికి అవకాశం లభించే పరిస్థితి లేదు. భద్రాచలంలో కూడా 2018లోనే 10 పడకలతో డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు 230 మందికి 37 వేల సార్లు డయాలసిస్ చేశారు. ఇందులో 110 మంది చనిపోగా కొత్త వారికి అవకాశం లభించింది. ప్రస్తుతం ఇక్కడు వెయిటింగ్‌లో ఒక్కరు కూడా లేరు.

**ప్రైవేట్‌కు వెళ్తే రూ.వేలకు వేలు..**

జిల్లాలోని జూలురుపాడు, చండ్రుగొండ, సుజాతనగర్, బొమ్మనపల్లి, పాల్వంచ, చాతకొండ, లక్ష్మీదేవిపల్లి, పారిశ్రామిక ప్రాంతమైన పాల్వంచ పట్టణం, ఉల్వనూరు, ములకలపల్లి తదితర ప్రాంతాల్లోని కిడ్నీ రోగులకు రక్తశుద్ధికి జిల్లా కేంద్రంలోని సర్వజన ఆస్పత్రికి వస్తున్నారు. ఇప్పటికే ఇక్కడ 40 మంది వెయిటింగ్‌లో ఉండటంతో కిడ్నీ రోగులు నిరాశతో వెనుదిరిగిపోతున్నారు. ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లి వేల రూపాయలు చెల్లిస్తున్నారు.

**నియోజకవర్గానికి ఒకటేనట..**

2108 సంవత్సరంలోనే పాల్వంచ ప్రభుత్వాస్పత్రిలో కూడా అప్పటి డీసీహెచ్ ముక్కంటేశ్వరరావు ఆధ్వర్యంలో రూ.17 లక్షలు ఖర్చు చేసి డయాలసిస్ కేంద్రానికి ఏర్పాట్లు చేశారు. ఏసీ, రూమ్, ఇతర పరికరాలు అందుబాటులోకి తెచ్చారు. అదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వం ఒక నియోజకవర్గంలో ఒకే డయాలసిస్ కేంద్రం ఉండాలని ఆదేశాలు విడుదల చేసింది. దీంతో పాల్వంచలోని డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేయకముందే రద్దు చేసినట్లయింది. దీంతో పాల్వంచ, పరిసర ప్రాంతాల బాధితులు కొత్తగూడెం రావాల్సి వస్తోంది.

**మళ్లీ ప్రతిపాదనలు పంపాం**



పాల్వంచలో రద్దయిన డయాలసిస్ కేంద్రానికి మళ్లీ ప్రతిపాదనలు పంపించాం. జిల్లా కేంద్రంలో ఉన్న డయాలసిస్ కేంద్రంలో కిడ్నీ రోగుల రక్త శుద్ధి కోసం వెయిటింగ్‌లో ఉన్నారు. పాల్వంచలో కేంద్రం ఏర్పాటు చేస్తే చాలా మంది రోగులకు రక్తశుద్ధి జరుగుతుంది. ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు చొరవ తీసుకుని మంజూరు చేయించాలి.- రవిబాబు నాయక్, డీసీహెచ్

## క్లుప్తంగా

### గుమ్మడవల్లి వాసికి డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న నాగిరెడ్డి

అశ్వారావుపేటరూరల్: మండలంలోని గుమ్మడవల్లి గ్రామానికి చెందిన అత్తునూరి నాగిరెడ్డికి డాక్టరేట్ లభించింది. సత్తుపల్లిలోని శాంతినికేతన్ జూనియర్ కళాశాల పూర్వ విద్యార్థి అయిన నాగిరెడ్డి స్కాలర్‌షిప్ సాయంతో డిగ్రీ పూర్తి చేసి హైదరాబాద్‌లోని కేంద్ర ప్రభుత్వ సంస్థ సీఎస్ఐఆర్–ఐఐసీటీలో సీటు సాధించారు. ఈ క్రమంలోనే 'లోహ ఉత్ప్రేరక సమక్షంలో ఆల్కలైన్ల క్రియాశీలత' అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి గాను సీఎస్ఐఆర్ – ఐఐసీటీ, ఏసీఎస్ఆర్ఐ – ఇండియా సంయుక్తంగా డాక్టరేట్ ప్రదానం చేశాయి. ఈ సందర్భంగా నాగిరెడ్డిని గ్రామస్తులు పలువురు అభినందించారు.

### రక్తనిధి కేంద్రంలో తనిఖీలు



వివరాలు ఆరా తీస్తున్న అధికారులు

భద్రాచలంఅర్బన్: స్థానిక ఏరియా ఆస్పత్రిలోని రక్తనిధి కేంద్రాన్ని శుక్రవారం కేంద్ర ఔషధాల ప్రామాణిక నియంత్రణ సంస్థ అధికారి శ్రీధర్ మిట్టపల్లితోపాటు జిల్లా అధికారి సంపత్ తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. రక్తనిధి కేంద్రంలో ఉన్న సాంకేతిక లోపాలను త్వరతగతిన పూర్తి చేసుకోవాలని, నిత్యం రక్తనిధి కేంద్రంలో రక్తనిల్వలు ఉండే విధంగా ఆస్పత్రి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. రక్తదానంపై ప్రజల్లో అవగాహన కల్పించాలని, రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ రామకృష్ణ, రక్తనిధి కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

### శక్తి సదన్‌ను సందర్శించిన న్యాయమూర్తి

కొత్తగూడెంటౌన్: చుంచుపల్లి మండలంలోని విద్యానగర్‌కాలనీలోని శక్తిసదన్‌ను శుక్రవారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, జడ్జి జి. భానుమతి సందర్శించారు. ఆపదలో ఉన్న మహిళలకు కల్పిస్తున్న ఆశ్రయం, ఆహారం, దుస్తులు, వైద్యం, సంరక్షణ తదితర వివరాలు ఆరా తీశారు. బాధితులకు భరోసా కల్పించాలని నిర్వాహకులకు సూచించారు. న్యాయవాదులు జీకే అన్నపూర్ణ, భానుప్రియ, పార్వతి, మెండు రాజమల్లు, శక్తి సదన్ నిర్వాహకులు వి.సత్యనారాయణ రెడ్డి, డి. ప్రభావతి, కె.రాజేశ్వరి, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

### ఇండోర్ స్టేడియం ఏర్పాటు చేయాలి

కొత్తగూడెంటౌన్: జిల్లా కేంద్రంలో ఇండోర్ స్టేడియం ఏర్పాటు చేయాలని కోరుతూ షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి పరంధామరెడ్డికి వినతిపత్రం అందించారు. అసోసియేషన్ బాధ్యులు శీలం శ్రీనివాసరావు, యనమదల వేణుగోపాల్, ధరావత్ రమేష్, తాటి హాసన్, దాచి బాగ్యరాజు, ఎల్లండి రాము తదితరులు పాలొన్నారు.

### మావోయిస్టు కొరియర్ అరెస్టు

వివరాలు వెల్లడించిన చర్ల సీఐ రాజగోపాల్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ, వెనుక నిందితుడు

చర్ల: మావోయిస్టు కొరియర్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ఈ నెల 21 నుంచి 27 వరకు మావోయిస్టు ఆవిర్భావ దినోత్సవాలు నిర్వహిస్తున్నారు. పార్టీ నేతలు దామోదర్, ఆజాద్ ఆదేశాల మేరకు చర్ల మండలంలోని లెనిన్ కాలనీ పాతచర్ల మధ్యలోని రహదారిపై వేసేందుకు కరపత్రాలు తీసుకొస్తున్న కొరియర్‌ను వెంకటచెరువు సమీపంలో పోలీసులకు పట్టుబడ్డాడు. చర్ల సీఐ బి.రాజగోపాల్ శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లా మిర్తూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పుల్లాం గ్రామానికి చెందిన కుంజా ఉమేశ్ అలియాస్ భద్రు ఛత్తీస్‌గఢ్ నుంచి ఉంజుపల్లి మీదుగా చర్ల వైపునకు వస్తున్నాడు. వెంకటచెరువు సమీపంలో గురువారం సాయంత్రం తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులను చూసి పారిపోయే ప్రయత్నం చేయగా వెంబడించి అతడిని అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాలు లభ్యమయ్యాయి. అతడిని చర్లకు తీసుకొచ్చి విచారించగా మావోయిస్టు కొరియర్ అని తేలిందని సీఐ తెలిపారు. సమావేశంలో ఎస్ఐలు టీవీఆర్ సూరి, ఆర్.నర్సిరెడ్డి ఉన్నారు.

### పామాయిల్ గెలలు



| | |
|---|---|
| టన్ను ధర | రూ.13,026 |

# సజావుగా టెట్



పాల్వంచ: డీఏవీ పాఠశాల కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీఐ వినయ్‌కుమార్

టీచర్ ఎలిజిబులిటీ టెస్ట్ (టెట్) జిల్లాలో ప్రశాంతంగా జరిగింది. అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు చేయగా అభ్యర్థులు ప్రశాంతంగా పరీక్ష రాశారు. పరీక్ష రాసేందుకు చిన్నపిల్లల తల్లులు, గర్భిణులు కూడా వచ్చారు. పరీక్ష సమయానికి అరగంట ముందే అభ్యర్థులను అనుమతించారు. చిన్నపిల్లలతో వచ్చిన అభ్యర్థులు వారిని తమ కుటుంబ సభ్యులకు అప్పగించి పరీక్ష రాశారు. పోలీసులు కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు చేపట్టారు. –సాక్షి నెట్‌వర్క్



పాల్వంచరూరల్: పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ వెంకటేశ్



పాల్వంచరూరల్: పరీక్ష కేంద్రంలోకి వెళ్తున్న గర్భిణి



బూర్గంపాడు: భద్రాచలం పబ్లిక్ స్కూల్‌లో హాల్ టికెట్లు పరిశీలిస్తున్న అధికారులు



పాల్వంచరూరల్: చంటిబిడ్డతో పరీక్షకు వస్తున్న అభ్యర్థి



భద్రాచలంటౌన్: చిరునామా సరిగా లేదని హాల్ టికెట్ చూపిస్తున్న అభ్యర్థి



భద్రాచలంఅర్బన్: చివరి నిమిషంలో వచ్చిన అభ్యర్థిని తనిఖీ చేస్తున్న పోలీసులు



పాల్వంచలోని సెంటర్‌లోకి వస్తున్న అభ్యర్థులు

### సీఐ కరుణాకర్ ఔదార్యం



నాగలక్ష్మిని పరీక్ష కేంద్రానికి తీసుకొస్తున్న సీఐ కరుణాకర్

కొత్తగూడెంటౌన్: టెట్ రాయడానికి వచ్చిన విద్యార్థినికి చేతికి గాయాలై ఇబ్బంది పడుతుంటే గమనించిన కొత్తగూడెం వన్‌టౌన్ సీఐ కరుణాకర్ వైద్యం చేయించి సకాలంలో పరీక్ష రాసే విధంగా చూశారు. శుక్రవారం కొత్తగూడెంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో టెట్ రాయడానికి దుమ్ముగూడెం నుంచి నాగలక్ష్మి వచ్చింది. చేతికి గాయం కావడంతో బాధపడుతుండగా గమనించిన సీఐ కరుణాకర్.. తన వాహనంలో ఆస్పత్రికి తీసుకువెళ్లి ప్రథమ చికిత్స చేయించి పరీక్ష కేంద్రానికి చేర్చారు. ఈ సందర్భంగా సీఐని పలువురు అభినందించారు.

# అంగన్‌వాడీ కేంద్రాల తాళాలు పగులగొట్టి..

ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసిన అధికారులు..



సుజాతనగర్: తాళాలు పగలగొడుతున్న సూపర్‌వైజర్లు

అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు సమ్మె చేస్తుండటంతో గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పడుతున్న ఇబ్బందులు గమనించి ఉన్నతాధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వేసిన తాళాలు పగులగొట్టి లోపలికి ప్రవేశించి, ఆహారం అందించారు.

**సుజాతనగర్‌లో..**

సుజాతనగర్: అంగన్‌వాడీ సిబ్బంది చేస్తున్న సమ్మె ఐదోరోజుకు చేరింది. సింగభూపాలెం, నాయకులగూడెం గ్రామాల్లోని కేంద్రాల తాళాలు పగులగొట్టేందుకు సూపర్‌వైజర్లు రాగా వారి ప్రయత్నాలను అంగన్‌వాడీ సిబ్బంది అడ్డుకున్నారు. కాగా, అధికారంలోకి వచ్చాక కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మనెంట్ చేస్తామని చెప్పిన సీఎం కేసీఆర్ మాట తప్పారని భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) జిల్లా సహాయ కార్యదర్శి ఏదులాపురం గోపాల్‌రావు, సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా నాయకుడు బానోత్ ధర్మా ఆరోపించారు. సమ్మెకు వారు మద్దతు ప్రకటించారు.

**పాల్వంచమండలంలో..**



పాల్వంచరూరల్: కోడిగుడ్లు పంపిణీ చేస్తున్న సీడీపీఓ కనకదుర్గ

పాల్వంచరూరల్: మండలంలోని 12 కేంద్రాలు, పట్టణ పరిధిలోని 30 కేంద్రాలను తెరిచామని సీడీపీఓ కనకదుర్గ తెలిపారు. మామిడిగూడెం, మందెరకలపాడు, బంజర, కొత్తూరు, ఉల్వనూరులోని రెండు కేంద్రాల తాళాలను పగలగొట్టి కోడిగుడ్లను పంపిణీ చేశారు.

**ఇల్లెందు మండలంలో..**



ఇల్లెందురూరల్: వేపలగడ్డలో పౌష్టికాహారం అందిస్తున్న సీడీపీఓ లక్ష్మీప్రసన్న, కార్యదర్శి షర్మిల

ఇల్లెందురూరల్: ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారాన్ని గ్రామ పంచాయతీ కార్యదర్శుల ద్వారా పంపిణీ చేస్తున్నామని సీడీపీఓ లక్ష్మీప్రసన్న శుక్రవారం తెలిపారు.

### డెంగీ నిర్మూలనకు చర్యలు తీసుకుంటున్నాం..

కొత్తగూడెంరూరల్: జిల్లాలో డెంగీ నిర్మూలనకు చర్యలు తీసుకుంటున్నామని డీఎంహెచ్‌ఓ శిరీష శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నామని, ఇంట్లోని డ్రమ్ములు, కూజాలు, కుండీల్లో నీరు నిల్వ ఉంచొద్దని సూచించారు. ప్రైవేట్ ల్యాబ్‌లలో పరీక్షలు నిర్వహించి డెంగీ అని చెబితే నమ్మొద్దని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో డెంగీ పరీక్షలు నిర్వహిస్తారని వెల్లడించారు. జ్వరం వస్తే వెంటనే భయపడొద్దని, ఎన్ఎస్–01 పాజిటివ్ వచ్చినా డెంగీ అని కంగారు పడొద్దని, ఎలిషా పరీక్ష ద్వారా మాత్రమే డెంగీ నిర్ధారణ చేసుకోవాలని తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు 168 మందికి మాత్రమే డెంగీ వచ్చిందని, వారు కూడా కోలుకున్నారని వివరించారు.

# ఫేషియల్ యాప్‌తో అటెండెన్స్

డీఈఓ వెంకటేశ్వరాచారి





విద్యార్థి ఫొటో తీస్తున్న ఉపాధ్యాయుడు

కొత్తగూడెంఅర్బన్: జిల్లాలోని 1,071 ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 56,071 మంది విద్యార్థుల అటెండెన్స్‌ను ఇక నుంచి ఫేషియల్ యాప్ ద్వారా తీసుకుంటామని జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.వెంకటేశ్వరచారి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన వివరాలు వెల్లడించారు. ప్లే స్టోర్ నుంచి డీఎస్ఈ అండ్ ఎఫ్ఆర్ఎస్ అనే యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని, లాగిన్ అయితే విద్యార్థుల వివరాలు కనిపిస్తాయని తెలిపారు. అనంతరం విద్యార్థి ఫొటోను రిజిస్టర్ చేయాలని సూచించారు. దీంతో విద్యార్థి ఫొటో, పేరుతో అనుసంధానం అవుతుందని పేర్కొన్నారు. రిజిస్టర్ చేసుకున్నాక ఒకే క్లిక్‌తో మొత్తం విద్యార్థుల అటెండెన్స్ పూర్తి చేయవచ్చని తెలిపారు. దీని ప్రాతిపదికపైనే మధ్యాహ్న భోజన బిల్లులు జనరేట్ అవుతాయని వివరించారు. ఇంటర్నెట్ సౌకర్యం లేనప్పుడు కూడా ఈ యాప్ ద్వారా వివరాలను నమోదు చేసుకోవచ్చన్నారు. ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ట్యాబ్‌ల ద్వారా, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు మొబైల్ ద్వారా ఈ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. సందేహాలు ఉంటే ప్లానింగ్ కోఆర్డినేటర్ ఎన్.సతీష్‌కుమార్‌ను సంప్రదించాలని కోరారు.

# 'డిజిటల్ కీ' దుర్వినియోగం!

ఆర్ఐ ధ్రువీకరించకుండానే ఎస్టీ కుల సర్టిఫికేట్ జారీ?



ములకలపల్లి తహసీల్దార్ కార్యాలయం

ములకలపల్లి: ఏజెన్సీ ప్రాంతంలో అతి కీలకమైన ఎస్టీ కులధ్రువీకరణ పత్రాల మంజూరులో బోగస్ ఉదంతంపై మండలవ్యాప్తంగా చర్చ జరుగుతోంది. మండలంలో ఓ ఎస్టీ సర్టిఫికెట్ మంజూరులో స్థానిక రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఐ) విచారణ లేకుండా.. ఆయన ధ్రువీకరించకుండా.. సంతకం చేయకుండానే ఎస్టీ కుల సర్టిఫికెట్ జారీ చేయడంపై సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది.

**అనుకోకుండా తెరపైకి..**

మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతి భూమి కొనుగోలు చేసేందుకు ఫారం–కే కు దరఖాస్తు చేసుకుంది. ఈ విషయమై క్షేత్రస్థాయిలో పర్యటించి, విచారణ చేపట్టిన ఆర్ఐకి విస్తుపోయే అంశం తెలిసింది. విచారణ సమయంలో అభ్యంతరాలు రావడంతో ఆర్ఐ వెనుతిరిగి వచ్చారు. ఈ క్రమంలో వారి కుటుంబీకులు, ఓ బ్యాంకుకు చెందిన ఉద్యోగులు తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి ఒత్తిడిచేశారు. విచారణ పేరిట యువతితో ఆర్ఐ అసభ్యకరంగా మాట్లాడారని ఆరోపిస్తూ.. సాక్షాత్తూ తహసీల్దార్ ఎదుటే ఆర్ఐతో వాదనకు దిగారు. దీంతో సదరు యువతి ఎస్టీ సర్టిఫికేట్‌కు సంబంధించిన ఫైల్‌ను రెవెన్యూ అధికారులు సమగ్రంగా అధ్యయనం చేశారు.

**ఆర్ఐకి తెలియకుండానే..**

ఈ ఘటనపై విచారణ చేపట్టిన ఆర్ఐకి కొత్త విషయాలు తెలిశాయి. తనకు తెలియకుండానే.. విచారణ లేకుండానే.. తన సంతకం లేకుండానే కులధ్రువీకరణ పత్రం మంజూరు కావడంతో నివ్వెరపోయారు. ఈ సర్టిఫికేట్‌కు సంబంధించి అసలు ఎలాంటి ఫైల్ లేకపోవడంతో అవాక్కయ్యారు. కుల ధ్రువీకరణ పత్రం కోసం సదరు యువతి దరఖాస్తు చేసుకోగా, ఆర్ఐ సంతకంతో సంబంధం లేకుండానే తహసీల్దార్ డిజిటల్ సంతకంతో 'మీ సేవ' సర్టిఫికెట్ మంజూరు కావడం గమనార్హం. కాగా, ఈ ఉదంతంలో తహసీల్దార్ కార్యాలయ కాంట్రాక్ట్ ఉద్యోగి కీలకంగా వ్యవహరించినట్లు సమాచారం. అతడు విధుల్లో చేరిన నాటి నుంచి అక్రమంగా ఎంతమందికి ఎస్టీ సర్టిఫికెట్లు ఇచ్చారనే విషయమై సమగ్రంగా విచారణ చేపట్టాల్సిన అవసరం ఉందని పలువురు కోరుతున్నారు.

**ఠాణాకు చేరిన పంచాయితీ**

కుల ధ్రువీకరణ పత్రం మంజూరులో తనను దూషించారని ఆర్ఐ వెంకటేశ్వర్లు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. తన విధులకు ఆటంకం కలిగిస్తూ, తనపై దూషణకు దిగారని ఫిర్యాదులో పేర్కొన్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈ విషయమై ఎస్ఐ సాయికిశోర్‌రెడ్డి మాట్లాడుతూ ఇరు పక్షాలు ఫిర్యాదు చేశారని, విచారణ చేపడుతున్నామని తెలిపారు.

**విచారణ చేపట్టాం..**

గత తహసీల్దార్ హయాంలో సర్టిఫికెట్ జారీ అయింది. జూలై నెలాఖరులో మంజూరైన ఆ సర్టిఫికెట్ విషయమై వివరాలు సేకరిస్తున్నాం. విచారణలో ఆర్ఐ–2 సంతకం లేకుండానే సర్టిఫికెట్ జారీ అయిన విషయం వాస్తవమే. విచారణ ఫైల్‌లో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఐ) సంతకం లేకుండానే కులధ్రువీకరణ పత్రం మంజూరు చేయొద్దు. ఈ సర్టిఫికెట్ విషయమై సమగ్ర విచారణ చేసి, తుది నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తాం.

– గుద్ల పుల్లారావు, తహసీల్దార్, ములకలపల్లి

# మాజీ నక్సలైట్ అంత్యక్రియల్లో హైడ్రామా

- మున్సిపల్ వైస్‌చైర్మన్ ఆధీనంలోని తోటలో దహన సంస్కారాలకు యత్నం
- పోలీసులు అడ్డుకోవడంతో మృతదేహాన్ని వదిలేసిన వెళ్లిన వైనం
- సీఐ, ఎస్ఐ నచ్చజెప్పాక శ్మశానవాటికలో అంత్యక్రియలు పూర్తి




తోటలో ఖననం అడ్డుకున్న పోలీసులతో చర్చిస్తున్న సమ్మయ్య కుమారుడు రమేశ్, బంధువులు



కొడెం సమ్మయ్య (ఫైల్)

ఇల్లెందు: ప్రజా ప్రతిఘటన మాజీ నక్సలైట్ అంత్యక్రియల సందర్భంగా హైడ్రామా చోటుచేసుకుంది. ఈ ఘటన ఇల్లెందులో శుక్రవారం చోటుచేసుకుంది. మాజీ నక్సలైట్ కొడెం సమ్మయ్య గురువారం సాయంత్రం అనారోగ్యంతో మృతి చెందగా, శుక్రవారం ఉదయం ఇల్లెందు హిందూ శ్మశానవాటికలో దహన సంస్కారాలకు ఏర్పాట్లు చేశారు. కానీ, మృతదేహాన్ని మున్సిపల్ వైస్ చైర్మన్ జానీపాషా ఆధీనంలో ఉన్న మామిడి తోటకు తరలించారు. ఆ భూమి తమదైతే కొందరు ఆక్రమించారంటూ మృతుడి కుటుంబ సభ్యులు పేర్కొంటూ ఖననం చేసే ప్రయత్నం చేశారు. దీంతో వైస్ చైర్మన్ జానీపాషా ఫిర్యాదు మేరకు అక్కడికి వచ్చిన పోలీసులు ఖననం చేయకుండా అడ్డుకోగా వాగ్వాదం నెలకొంది. తన తండ్రి ఆత్మ శాంతించాలంటే తమ తోటలోనే ఖననం చేయాలని, లేదంటే 'మీరే' అంత్యక్రియలు చేసుకోండంటూ మృతదేహాన్ని వదిలేసి మృతుడి కుమారుడు రమేశ్, బంధువులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. దీంతో పోలీసులు మృతుడి కుటుంబీకులతో చర్చించారు. ఈ భూమి కోర్టు కేసులో ఉందని, తీర్పు రాకముందు ఇక్కడ దహనం చేయకూడదని నచ్చజెప్పగా, చివరకు హిందూ శ్మశానవాటికలోనే అంత్యక్రియలు పూర్తిచేశారు. కాగా, ఇల్లెందు కాకతీయనగర్‌లో నివాసం ఉంటున్న పీపీజీ మాజీ నక్సలైట్ కొడెం సమ్మయ్య అలియాస్ చంద్రన్న 2008లో పోలీసులకు లొంగిపోయాడు. అజ్ఞాతంలో ఉన్నప్పుడు పలు ఎన్‌కౌంటర్ల నుంచి తప్పించుకున్నాడు. లొంగిపోయాక ప్రభుత్వం పునరావాసం కింద భూమి కేటాయించగా, అదే భూమిని కొందరు కబ్జా చేశారంటూ పోరాటం సాగిస్తున్నాడు. అడ్డా మీద కూలిగా జీవనం సాగిస్తూ అనారోగ్యంతో మృతి చెందాడు.

### బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా సోమసుందర్



సోమసుందర్

చుంచుపల్లి: భారతీయ జనతా పార్టీ తాత్కాలిక జిల్లా అధ్యక్షుడిగా ఇల్లెందుకు చెందిన నాళ్ల సోమసుందర్‌ను నియమిస్తూ రాష్ట్ర పార్టీ కార్యాలయం నుంచి శుక్రవారం ఆదేశాలు జారీ అయ్యాయి. ఇల్లెందుకు చెందిన సోమసుందర్ ప్రస్తుతం పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. గత జిల్లా అధ్యక్షుడిగా పనిచేసిన కోనేరు సత్యనారాయణను గత నెలలో రాష్ట్ర పార్టీ సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి జిల్లా అధ్యక్ష పదవి ఖాళీగానే ఉంది. ఈ తరుణంలో కొత్త అధ్యక్షుడు ఎంపికయ్యే వరకు నాళ్ల సోమసుందర్‌కు తాత్కాలికంగా బాధ్యతలు అప్పగించారు.

### ప్రియుడి ఇంటి ఎదుట నిరసన

ములకలపల్లి: ప్రేమిస్తున్నానని మాయమాటలు చెప్పి, పెళ్లికి నిరాకరించిన వ్యక్తి ఇంటి ఎదుట ప్రియురాలు బైఠాయించిన ఘటన శుక్రవారం మండలంలో చోటుచేసుకుంది. దమ్మపేట మండలం జగ్గారం గ్రామానికి చెందిన ఆదివాసీ యువతి జగన్నాథపురం హరిజనవాడకు చెందిన కనకం సంతోష్ ఏడాది కాలంగా ప్రేమించుకుంటున్నారు. ఈ తరుణంలో సంతోష్ వేరే మహిళతో వివాహానికి ప్రయత్నిస్తున్నట్లు తెలుసుకున్న యువతి శుక్రవారం యువకుడి ఇంటి ఎదుట బైఠాయించి నిరసన తెలిపింది. పలు ఆదివాసీ సంఘాలు యువతికి మద్దతు ప్రకటించాయి.



నిరసన తెలుపుతున్న యువతి తదితరులు

### గొత్తికొయపై బల్లెంతో దాడి..

పేగులు బయటకు రావడంతో పరిస్థితి విషమం

చర్ల: మండలంలోని బోదనెల్లి గ్రామ పంచాయితీ పరిధి బూరుగుపాడుకు చెందిన మడవి భద్రయ్యపై ఆర్.కొత్తగూడెం జీపీ దానవాయిపేటకు చెందిన మట్టా నర్సింహారావు బల్లెంతో దాడి చేశాడు. శుక్రవారం జరిగిన ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ దాడిలో భద్రయ్య పొట్టలో నుంచి పేగులు బయటకు రావడంతో స్థానికులు క్షతగాత్రుడిని భద్రాచలం ఏరియా వైద్యశాలకు తరలించారు. అక్కడి నుంచి ప్రైవేట్ వైద్యశాలకు తీసుకెళ్లగా చేర్చుకోక పోవడంతో కొత్తగూడెం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. దాడి జరగడానికి గల కారణాలు తెలియరాలేదు. ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

### లారీకింద పడి డ్రైవర్ మృతి



రాము (ఫైల్)

దమ్మపేట/ సత్తుపల్లిరూరల్ : ప్రమాదవశాత్తు లారి కింద పడి డ్రైవర్ మృతి చెందిన ఘటన మండలంలోని మంగాపురం గ్రామశివారులో శుక్రవారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యు లు, స్థానికుల కథనం ప్రకారం.. సత్తుపల్లి మండలం రామానగరం గ్రామానికి చెందిన బెజవాడ రాము (30) లారీడ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. లారీని నడుపుకుంటూ వెళ్తున్న రాముకు శబ్దంలో ఏదో తేడా అనిపించింది. మంగాపురం గ్రామశివారులో లారీని ఆపి దాని కిందకు వంగి చెక్ చేస్తున్నాడు. ప్రమాదవశాత్తు లారీ అతడి పైనుంచి వెళ్లడంతో రాము అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్తుపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

### పాముకాటుతో ఆదివాసీ మహిళ...

రహదారి ఇక్కట్లతో ఆలస్యంగా ఆస్పత్రికి..

చర్ల: మండలానికి చెందిన ఓ ఆదివాసీ యువతిని పాముకాటు వేయగా.. రహదా రి సక్రమంగా లేకపోవడంతో ఆస్పత్రికి తీసుకెళ్లడంలో జాప్యం జరిగి మృతి చెందింది. చర్ల మండలం రాజయ్యనగర్‌కు చెందిన దుబ్బా జ్యోతి(23) గురువారం రాత్రి ఇంట్లో కుటుంబీకులతో కలిసి నిద్రించింది. శుక్రవారం తెల్లవారుజామున జ్యోతి ఒక్కసారిగా కేకలు వేయడంతో మేల్కొన్న తండ్రి రామయ్య లైట్‌వేసి చూడగా ఆమె కాలుపై కాటు వేసిన పాము కనిపించింది. దీంతో రామయ్య పామును చంపేసి.. బురదమయమైన రహదారిపై మూడు కిలోమీటర్ల మేర నడిపిస్తూ ప్రధాన రహదారిపైకి వచ్చి ఆటోలో కొయ్యూరు ఆస్పత్రికి తీసుకెళ్లేలోగా అపస్మారక స్థితికి చేరిన జ్యోతి మృతి చెందింది. రహదారి సక్రమంగా లేకపోవడం వల్లనే సకాలంలో ఆస్పత్రికి చేరలేకపోయామని, దారిబాగుంటే తమ కుమార్తె ప్రాణాలు దక్కేవని జ్యోతి తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

### పురుగుల మందు తాగి వివాహిత ఆత్మహత్య

తిరుమలాయపాలెం: ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్య కారణాలతో ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన శుక్రవారం మండలంలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. మండలంలోని ఇస్లావత్‌తండాకు చెందిన ఇస్లావత్ సునీత(33)కు కొద్ది రోజులుగా అనారోగ్యంతో పాటు ఆర్థిక ఇబ్బందులు తోడయ్యాయి. దీంతో గురువారం ఆమె గడ్డి మందు తాగగా, కాసేపటికి గుర్తించిన కుటుంబీకులు ఖమ్మం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. సునీతకు భర్తతో పాటు ముగ్గురు పిల్లలు ఉండగా, ఆమె తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు.

## మృత్యువుతో పోరాడి ఓడిన అముద

### క్యాన్సర్‌తో బాధపడుతూ చికిత్స పొందుతూ మృతి


అముద (ఫైల్)

**కోదాడ:** క్యాన్సర్ మహమ్మారితో పోరాడుతున్న అముద అనే అభాగ్యురాలు చివరకు ఓడిపోయింది. ఆరు నెలలుగా చికిత్స పొందుతూ శుక్రవారం తుదిశ్వాస విడిచింది. తమిళనాడులో పుట్టి పెరిగిన అముద నారాయణ నాడార్(40) మతిస్థిమితం కోల్పోయి 15 ఏళ్ల క్రితం సూర్యాపేట జిల్లా కోదాడకు చేరుకుంది. మున్సిపాలిటీ చెత్తకుప్పల్లో ఆహారాన్ని వెతుక్కుంటుండగా పల్లా వెంకటేశ్వర్లు అనే స్థానికుడి కంటపడింది. ఆమెను వెంకటేశ్వర్లు చేరదీసి ఆదరించాడు. దాతలు, మానసిక వైద్యనిపుణుడు డాక్టర్ రఘురామిరెడ్డి సాయంతో మంచిమనిషిగా మార్చాడు. కొంతకాలం విద్యావలంటీర్‌గా పనిచేసింది. కోదాడ వ్యవసాయ మార్కెట్‌లో అటెండర్‌గా ఉద్యోగం చేస్తున్న క్రమంలో ఆరునెలల క్రితం ఆమె అనారోగ్యం బారిన పడింది. వైద్యులు పరీక్షించి క్యాన్సర్ అని తేల్చారు. వెంకటేశ్వర్లు ఆమెను హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చేర్పించి వైద్యం చేయించినా ఫలితం లేకపోయింది. వ్యాధి ముదరడంతో తీవ్రంగా ఇబ్బందిపడుతూ శుక్రవారం కోదాడలోని వెంకటేశ్వర్లు ఇంట్లోనే కన్నుమూసింది.

**అడుగడుగునా అండగా నిలిచిన ‘సాక్షి’**

చెత్తకుప్పల మధ్య ఉన్న అముదను వెంకటేశ్వర్లు ఆదరించిన వైనాన్ని, ఆ తర్వాత మంచిమనిషిగా మారిన అముద గురించి పలు సందర్భాల్లో ‘సాక్షి’కథనాలు ప్రచురించింది. అముద జీవిత చరిత్రను టెలిఫిల్మ్‌గా తీసిన విషయాన్ని కూడా వెలుగులోకి తెచ్చింది. అముదకు క్యాన్సర్ సోకిన విషయాన్ని ‘అయ్యో అముద’శీర్షికన కథనం ప్రచురించడంతో దాతలు ముందుకొచ్చి సాయం కూడా అందించారు.

## మూడు ‘రియల్’ సంస్థలకు రూ. 50 లక్షల జరిమానా

**సాక్షి, హైదరాబాద్:** జయత్రి(జయ గ్రూపు) ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఏజీఎస్ శ్రీనివాసం ప్రాపర్టీస్ ప్రైవేట్ లిమిటెడ్, ఈఏపీఎల్ సంస్థలు నిబంధనలు ఉల్లంఘించి పత్రికలు, టీవీల్లో ప్రకటనలు ఇవ్వడమేకాక, మార్కెటింగ్ నిర్వహించడంపై రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ(రెరా) కన్నెర్ర చేసింది. ఈ సంస్థలపై రూ. 50 లక్షల జరిమానా విధిస్తూ శుక్రవారం రెరా చైర్మన్ డాక్టర్ ఎన్.సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు.


ఎస్‌ఎస్ తాడ్వాయి మండలం మేడారంలో వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

# ఏజెన్సీకి వైద్యాధికారులు

**‘సాక్షి’ కథనానికి స్పందన**

సాక్షి ఎఫెక్ట్

**సాక్షిప్రతినిధి, వరంగల్:** ఏజెన్సీలో ప్రబలుతున్న విషజ్వరాలపై శుక్రవారం ‘సాక్షి’ ప్రధాన సంచికలో ‘ఏజెన్సీకి ఫీవర్’ శీర్షికన ప్రచురితమైన కథనానికి వైద్యాధికారులు స్పందించారు. జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో వైద్యశిబిరాలు ఏర్పాటు చేశారు. మహాముత్తారం మండలకేంద్రంతోపాటు అటవీ గ్రామాలైన సింగారం, పోలారం ప్రేమ్‌నగర్ తండాల్లో మండల వైద్యాధికారి సందీప్ ఆధ్వర్యంలో ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేశారు. ఇంటింటి సర్వే నిర్వహించి జ్వరాల బారిన పడిన వారి వివరాలు సేకరించారు. ములుగు జిల్లా వాజేడు మండలం ఇప్పగూడెంలో వైద్యశిబిరం నిర్వహించి 100మందికి మందుల కిట్ అందజేశారు. వాజేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎంహెచ్ఓ అప్పయ్య సందర్శించి రోగులను పరీక్షించారు. తాడ్వాయి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మేడారం, గంగారం గ్రామాల్లో, కొడిశాల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఎల్బాక, పడిగాపూర్ గ్రామాల్లో వైద్యశిబిరాలు నిర్వహించారు. మంగపేట మండలంలోని నర్సింహసాగర్, అకినేపల్లిమల్లారంలో వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి రక్త నమూనాలు సేకరించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు.

## మంత్రాల నెపంతో ఇద్దరిపై దాడి


బానోత్ నరేశ్, భాస్కర్‌ను చెట్టుకు కట్టేసిన దృశ్యం

**నర్సాపూర్‌రూరల్:** మంత్రాల నెపంతో ఇద్దరిని చెట్టుకు కట్టేసి చితకబాదిన ఘటన మెదక్ జిల్లాలో శుక్రవారం చోటు చేసుకుంది. నర్సాపూర్ మండలం పాప్యా తండాకు చెందిన బానోత్ లావణ్యకు జ్వరం రావడంతో ఈ నెల 14న నర్సాపూర్‌లోని ఓ ఆస్పత్రిలో చేర్పించారు. విషయం తెలుసుకున్న మెదక్ మండలం సంగాయిగుడి తండాకు చెందిన బంధువులు నేనావత్ భాస్కర్, మూడవత్ భాస్కర్ అదేరోజు సాయంత్రం వచ్చి లావణ్య, ఆమె భర్త నరేశ్‌ను పరామర్శించారు. ఈ క్రమంలో వైద్యులు ఆమెను రాత్రి డిశ్చార్జి చేయడంతో అందరూ కలిసి ఇంటికి చేరుకున్నారు. రాత్రి 10గంటల సమయంలో మూత్రవిసర్జన నిమిత్తం బయటికి వచ్చిన భాస్కర్‌ను స్థానికులైన రమావత్ సక్రు, రమావత్ మోహన్ అనుమానించి చెట్టుకు కట్టేసి చితకబాదారు. అరుపులు విని నరేశ్ బయటకు వచ్చి స్థానికులకు నచ్చజెప్పి తీసుకెళ్లాడు. శుక్రవారం ఉదయం మళ్లీ స్థానికులు నరేశ్ ఇంటికి చేరుకున్నారు. తమ ఇంటి చుట్టూ నిమ్మకాయలు, పసుపు, కుంకుమ ఉన్నాయంటూ భాస్కర్, నరేశ్‌లను చెట్టుకు కట్టేసి కట్టెలు, రాళ్లతో కొట్టారు. ఈ ఘటనపై బాధితుడి నరేశ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.


సునీతను టైరు సహాయంతో వాగు దాటిస్తున్న గజ ఈతగాళ్లు

# టైరును తెప్పలా చేసి.. గర్భిణిని వాగు దాటించి..

**ఏటూరునాగారం:** ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం ఎలిశెట్టిపల్లి వద్ద ఏటా వర్షాకాలంలో జంపన్నవాగు ప్రవాహంతో బానాజీబంధం, ఎలిశెట్టిపల్లి గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఎలిశెట్టిపల్లికి చెందిన దబ్బకట్ల సునీత ఏడు నెలల గర్భిణి. ఆమెకు శుక్రవారం నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తీసుకెళ్లడానికి సిద్ధమయ్యారు. జంపన్న వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. అక్కడే ఉన్న కొందరు గజ ఈతగాళ్లు, స్థానికుల సహాయంతో ట్రాక్టర్ వెనుక టైరును తెప్పలా మార్చారు. దానిపై గర్భిణిని కూర్చోబెట్టి వాగు దాటించి ఆస్పత్రికి తరలించారు. వైద్యులు ఆమెకు పరీక్షలు చేసి సాధారణమైన నొప్పులేనని చెప్పడంతో కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు. వాగుపై వంతెన నిర్మిస్తే తమ కష్టాలు తొలగిపోతాయని, ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో తాత్కాలిక బోటు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# అజ్ఞాతం వీడండి

- మావోయిస్టులకు డీజీపీ అంజనీకుమార్ పిలుపు
- కేంద్ర కమిటీ సభ్యుడు సంజోయ్ దీపక్‌రావు అరెస్టు


మీడియాతో మాట్లాడుతున్న డీజీపీ. చిత్రంలో సంజోయ్ దీపక్‌రావు

**సాక్షి, హైదరాబాద్:** మావోయిస్టు రాష్ట్ర కమిటీ సభ్యులు, తెలంగాణకు చెందిన అగ్రనేతలు, కేడర్ అజ్ఞాతం వీడి పోలీసులకు లొంగిపోవాలని డీజీపీ అంజనీకుమార్ విజ్ఞప్తి చేశారు. మావోయిస్టులు అజ్ఞాతం వీడి రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు సంజోయ్ దీపక్‌రావును శుక్రవారం ఉదయం కూకట్‌పల్లిలోని మలేషియన్ టౌన్‌షిప్‌లో అరెస్టు చేసినట్టు డీజీపీ తెలిపారు. నాలుగు రోజుల క్రితం హైదరాబాద్‌కు వచ్చిన దీపక్‌రావు ఛత్తీస్‌గఢ్‌లోని మాడ్ ప్రాంతంలో ఓ మావోయిస్టు సమావేశానికి హాజరుకావాల్సి ఉందని, ఆయన కదలికలపై ఎస్ఐబీ (స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో)కు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు సైబరాబాద్ పోలీసులు అరెస్టు చేశారన్నారు. ఒక రివాల్వర్, ఆరు లైవ్‌రౌండ్లు(బుల్లెట్లు), రూ.47,250 నగదు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. మలేషియన్ టౌన్‌షిప్‌లో ఉండే మహేంద్రటెక్ యూనివర్సిటీ ప్రొఫెసర్ రంజిత్‌శంకరన్, మాదాపూర్‌కు చెందిన ఓ సినీ దర్శకుడు బి.అజిత్‌కుమార్‌లు దీపక్‌రావుకు ఆశ్రయం ఇచ్చినట్టు గుర్తించామన్నారు. శుక్రవారం డీజీపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. కొన్నేళ్లుగా తెలంగాణ నుంచి మావోయిస్టుల రిక్రూట్‌మెంట్ పూర్తిగా శూన్యమని, సంజోయ్ దీపక్‌రావు అరెస్టుతో ఆ పార్టీకి ఎదురుదెబ్బ తగిలినట్టయ్యిందన్నారు. దీపక్‌రావు మావోయిస్టు అగ్రనేతలు గణపతి, బస్వరాజ్, కోసాలతో నేరుగా సంబంధాలున్నట్టు తెలిపారు.

**నాలుగు రాష్ట్రాల పోలీసులకు మోస్ట్ వాంటెడ్**

సంజోయ్ దీపక్‌రావు ప్రస్తుతం కేంద్ర కమిటీతోపాటు సౌత్ రీజియన్ బ్యూరో ఇన్‌చార్జ్‌గా, వెస్ట్రన్ ఘాట్ స్పెషల్ జోన్ కమిటీ కార్యదర్శిగా ఉన్న ఆయన మహారాష్ట్ర, కేరళ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల పోలీసులతోపాటు జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ)కు మోస్ట్‌వాంటెడ్‌గా ఉన్నారు. దీపక్‌రావుపై మహారాష్ట్ర ప్రభుత్వం రూ.25 లక్షల రివార్డు ప్రకటించింది. మహారాష్ట్రలోని థానే జిల్లా అంబర్‌నాథ్ ఈస్ట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని శివగంధనగర్‌కు చెందిన సంజయ్ దీపక్‌రావు జమ్మూకశ్మీర్‌లో 1984లో బీటెక్ పూర్తి చేశారు. 1999లో సీపీఐఎంఎల్ రవూఫ్ గ్రూప్‌లో తొలుత చేరారు. నక్సల్‌బరీ గ్రూప్‌నకు మహారాష్ట్ర ఇన్‌చార్జ్‌గా పనిచేశారు. 2000లో ఓసారి అరెస్టు, తర్వాత విడుదలై మళ్లీ అజ్ఞాతంలోకి వెళ్లారు. 2002లో అనంతపురం జిల్లా రాయదుర్గం ప్రాంతంలో మావోయిస్టు కార్యకలాపాల వ్యాప్తికి కీలకంగా పనిచేశారు. 2014లో నక్సల్‌బరీ, సీపీఐ మావోయిస్టులో విలీనం కావడంలో కీలక పాత్ర పోషించారు. నవంబర్ 2021లో పశ్చిమ కనుమల ప్రత్యేక జోనల్ కమిటీ కార్యదర్శి బీజీ కృష్ణమూర్తి అరెస్టు తర్వాత, ఆ జోనల్‌కు ప్రత్యేక జోనల్ కమిటీకి కార్యదర్శిగా నియామకం కాగా, అప్పటి నుంచి అక్కడే పనిచేస్తున్నారు.

# అంగన్‌వాడీల్లో కొత్త కొలువులు!

- మినీ కేంద్రాల అప్‌గ్రేడ్‌తో 3,989 హెల్పర్ పోస్టులకు చాన్స్
- కసరత్తు చేస్తున్న మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ

**సాక్షి, హైదరాబాద్:** మినీకేంద్రాల స్థాయి పెంచి ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాలుగా మార్పు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో కొత్త కొలువులకు అవకాశం ఏర్పడింది. రాష్ట్రంలో 149 ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 35,700 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. ఇందులో 31,711 కేంద్రాలు ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాలు కాగా, 3,989 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు. ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాల్లో ఒక టీచర్, ఒక హెల్పర్ ఉంటే.. మినీకేంద్రాల్లో మాత్రం ఒక టీచర్ ఉంటారు. ఇక్కడ హెల్పర్ ఉండరు. తాజాగా మినీ కేంద్రాల అప్‌గ్రేడ్‌తో అక్కడ హెల్పర్ పోస్టు అనివార్యమైంది. రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖకు అప్‌గ్రేడ్ వివరాలు పంపింది. ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాలుగా మార్చడంతో వాటికి కేంద్రం నుంచి రావాల్సిన గ్రాంట్ కూడా పెరుగుతుంది. కేంద్ర ప్రభుత్వం అంగీకరిస్తే కొత్తగా హెల్పర్ల నియామకం చేపట్టొచ్చు.

**టీచర్ల భర్తీ తర్వాతే...**

రాష్ట్రవ్యాప్తంగా పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన రిటైర్మెంట్ పాలసీతో దాదాపు రెండున్నర వేలమంది టీచర్లు పదవీ విరమణ పొందాల్సి ఉంది. ఈక్రమంలో అన్ని రకాల్లో కలిపి నాలుగువేల వరకు పోస్టులు ఖాళీగా ఉంటాయి. అయితే కొన్ని జిల్లాల్లో అంగన్‌వాడీ టీచర్ పోస్టులకు రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ నోటిఫికేషన్లు జారీ చేసి, భర్తీ ప్రక్రియ ప్రారంభించింది. అయితే వివిధ కారణాలతో ఆ ప్రక్రియ పూర్తి కాలేదు. తాజాగా మినీ కేంద్రాల అప్‌గ్రెడేషన్‌తో హెల్పర్ పోస్టులు భర్తీ చేయాల్సి ఉండగా, అంతకుముందే అంగన్‌వాడీ టీచర్ పోస్టులు భర్తీ చేయాలని అధికారులు భావిస్తున్నారు. ఈమేరకు జిల్లాల వారీగా ఖాళీల వివరాలతో కూడిన ప్రతిపాదనలు సమర్పించాలని రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ జిల్లా సంక్షేమాధికారులను ఆదేశించింది. కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే సూచనలకు అనుగుణంగా అధికారులు తదుపరి చర్యలు తీసుకుంటారు.

జిల్లా వార్తలు

## ఎస్సీ గురుకులాల్లో స్పాట్ అడ్మిషన్లు

**ఖమ్మంమయూరిసెంటర్:** తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో 5 నుంచి 9వ తరగతి వరకు మిగిలిన సీట్లను స్పాట్ కౌన్సెలింగ్ ద్వారా భర్తీ చేయనున్నట్లు ఆర్సీఓ కె.ప్రత్యూష ఒక ప్రకటనలో తెలిపారు. ఖమ్మం రీజియన్ పరిధి ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల్లోని గురుకులాల్లో మిగిలిన సీట్ల భర్తీకి ఈనెల 23న కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. గతంలో బ్యాక్‌లాగ్ ప్రవేశ పరీక్ష రాసిన ఎస్సీ విద్యార్థులు హాల్‌టికెట్లతో ఖమ్మంలోని డాక్టర్ అంబేద్కర్ జూనియర్ కళాశాలలో జరిగే కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని సూచించారు. అయితే, అనాథలు, పాక్షిక అనాథలు, దివ్యాంగ విద్యార్థులకు ప్రాధాన్యత ఉంటుందని, ఇందుకోసం ధ్రువీకరణ పత్రాలు తీసుకురావాలని ఆర్సీఓ తెలిపారు.

## ఎన్జీటీ ఆదేశాల ఉల్లంఘనపై ఏం చర్యలు తీసుకున్నారు?

**అశ్వాపురం:** పర్యావరణ అనుమతులు లేకుండా జరుగుతున్న సీతమ్మసాగర్ బహుళార్థ సాధక ప్రాజెక్ట్ పనులు ఆపేయాలని జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్జీటీ) ఇచ్చిన ఆదేశాలు ఉల్లంఘించిన తెలంగాణ ప్రభుత్వంపై ఏం చర్యలు తీసుకున్నారని ట్రిబ్యునల్ ధర్మాసనం ప్రశ్నించింది. చెన్నైలోని ఎన్జీటీ ధర్మానంలో శుక్రవారం సీతమ్మసాగర్ బహుళార్థసాధక ప్రాజెక్ట్‌పై విచారణ జరిగింది. ఎన్జీటీ ఆదేశాల ఉల్లంఘనపై ఏం చర్యలు తీసుకున్నారో చెప్పాలని ధర్మాసనం కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖను ప్రశ్నించింది. కాగా, పర్యావరణ అనుమతులు లేకుండా ఎన్జీటీ ఆదేశాలు ఉల్లంఘించి ప్రాజెక్ట్ పనులు చేపట్టడంతో ప్రభుత్వానికి ఇటీవలే షోకాజ్ నోటీసులు ఇచ్చామని అధికారులు బదులిచ్చారు. అయితే, షోకాజ్ నోటీసుపై 15 రోజుల్లో వివరణ తీసుకుని అందజేయాలని సూచిస్తూ తదుపరి విచారణను అక్టోబర్ రెండో వారానికి ఎన్జీటీ వాయిదా వేసింది.

## పోస్టల్ పథకాలను సద్వినియోగం చేసుకోండి

**కూసుమంచి:** తపాలా శాఖ ఆధ్వర్యాన అమలవుతున్న పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఖమ్మం సౌత్ డివిజన్ ఐపీ బాజీబాబు సూచించారు. కూసుమంచి మండలంలోని జక్కేపల్లిలో శుక్రవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. పోస్టాఫీస్ బీమా పథకం ప్రజలకు ఎంతో మేలు చేస్తుందని, తక్కువ ప్రీమియంతోనే రూ.10 లక్షల బీమా అమలవుతోందని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ నలబోలు మాధవి, ఎంపీటీసీ కందుల వెంకటనారాయణ, తపాలా శాఖ ఉద్యోగులు పి.నాగేశ్వరరావు, లక్ష్మణ్, సోమేశ్వరరావు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# పెసర.. దక్కని మద్దతు ధర

- కనీస ధర లేక రైతుల ఆవేదన
- ఇప్పటికే దిగుబడి లేక అవస్థ
- వ్యాపారి చెప్పిందే వేదం
- ప్రభుత్వం రంగంలోకి దిగితేనే ఫలితం


ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు రైతులు తీసుకొచ్చిన పెసలు (ఇన్‌సెట్) పెసలను కాంటా వేస్తున్న హమాలీలు

**ఖమ్మంవ్యవసాయం:** వానాకాలం సాగు చేసిన పెసర పంట చేతికొస్తోంది. వ్యవసాయ మార్కెట్లలో విక్రయాలు కూడా ప్రారంభమయ్యాయి. ఈ ఏడాది పెసర సాగు ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో సాగగా.. తొలినాళ్లలో వర్షాలు కురవకపోవటంతో సాగు తడబడింది. జిల్లాలో విస్తారంగా సాగు చేసే పెసర ఈసారి 14,312 ఎకరాలకే పరిమితమైంది. ఆతర్వాత కూడా ప్రతికూల పరిస్థితులే ఎదురుకావడంతో దిగుబడిపై ప్రభావం చూపింది. ఇక అరకొరగా వచ్చిన దిగుబడికి సైతం మద్దతు ధర కూడా దక్కటం లేదు. ఓ వైపు పప్పుల ధరలు ఆకాశాన్నంటుతుండగా, రైతు పండించిన పెసర పంటకు మాత్రం కనీస మద్దతు ధర లేక ఆవేదన చెందుతున్నారు. పొంతన లేని ధరలతో వ్యాపారులు కొనుగోళ్లు చేస్తుండగా.. నిల్వ చేయలేక, ప్రభుత్వం ఎప్పుడు కొనుగోళ్లు చేస్తుందో తెలియక ఎంతో కొంతకు అమ్మేసుకుంటున్నారు.

**రూ.7వేల నుంచి రూ.8వేల వరకే..**

పెసలకు కనీస మద్దతు ధర లభించడం లేదు. పంట చేతికొస్తుండడంతో ఇతర పంటల సాగు పెట్టుబడి కోసం రైతులు విక్రయిస్తున్నారు. ఈ ఏడాది కేంద్రప్రభుత్వం పెసలు క్వింటాకు కనీస మద్దతు ధర రూ.8,558గా నిర్ణయించింది. అయితే ప్రస్తుతం వ్యవసాయ మార్కెట్లలో రూ.7వేలు మొదలు రూ.8,200 వరకే కొనుగోళ్లు చేస్తున్నారు. అదే పెసర పప్పు కేజీ రూ.130 వరకు ధర పలుకుతోంది. వ్యాపారులు విక్రయించే పప్పుకు ధర పలుకుతుండగా, రైతులు విక్రయించే పెసలకు మాత్రం ధర పెట్టడం లేదు.

**ప్రభుత్వ కొనుగోళ్లు లేకపోవడంతోనే..**

ప్రభుత్వం కొనుగోళ్లకు రంగంలోకి దిగితేనే పంటకు మద్దతు ధర దక్కే అవకాశం ఉంది. ప్రభుత్వం పెసల కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు ముందుకు వస్తే జాతీయంగా, అంతర్జాతీయంగా పెసలకు ఉన్న డిమాండ్ తెరపైకి వస్తుంది. కానీ ప్రభుత్వం దృష్టి సారించకపోవడంతో ఇదే అదునుగా వ్యాపారులు ఇష్టారాజ్యంగా ధర నిర్ణయించి రైతులను దగా చేస్తున్నారు. రెండేళ్లుగా ఇదే తంతు కొనసాగుతోంది. జిల్లాలో అపరాల పంటల్లో మెట్ట పంటగా రైతులు పెసర సాగు చేస్తారు. ఈ ఏడాది వానాకాలంలో జిల్లాలో పెసర సాగు లక్ష్యం 25 వేల ఎకరాలుగా నిర్దేశించినా.. ప్రకృతి వైపరీత్యాలు, నష్టాలను దృష్టిలో పెట్టుకొని రైతులు తక్కువగానే సాగు చేశారు.

**వ్యాపారి చెప్పిందే వేదం...**

కేంద్రప్రభుత్వం ఈ ఏడాది పెసలు క్వింటాకు కనీస మద్దతు ధర గత ఏడాది రూ.7,755, ఈ ఏడాది రూ.8,558గా నిర్ణయించింది. గతంతో పోలిస్తే ఈ ఏడాది క్వింటాకు ఏకంగా రూ.803 పెంచారు. రైతులను ప్రోత్సహించటంలో భాగంగా ధర పెంచినా... ఆ ధర రైతులకు ఎక్కడా లభించడం లేదు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటైతే తప్ప ఫలితం ఉండదని తెలిసినా ఎవరూ పట్టించుకోవడం లేదు. గ్రామాల్లో క్వింటాకు రూ.6,500 నుంచి రూ.7వేల వరకు చెల్లిస్తుండగా, ఖమ్మం మార్కెట్‌లో రూ.7నుంచి రూ.8 వేల వరకు కొనుగోళ్లు చేస్తున్నారు. పంటకు డిమాండ్ ఉన్నా వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడడంతోనే ఈ పరిస్థితి నెలకొన్నట్లు చెబుతున్నారు. కాగా, ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో పంట సాగు తగ్గడంతో పాటు ఆశించిన స్థాయిలో దిగుబడి కూడా రాలేదు. ఎకరాకు ఐదు నుంచి ఆరు క్వింటాళ్లకు బదులు రెండు నుంచి మూడు క్వింటాళ్లకు మించి దిగుబడి వచ్చిందని అంచనా. ఎకరాకు రూ.15 వేల మేర పెట్టుబడి పెట్టగా... ఆ స్థాయిలో దిగుబడి లేక, ధర దక్కక రైతులు ఆవేదన చెందుతున్నారు.


**పెసర సాగుతో నష్టమే..**



ఎకరన్నర భూమిలో పెసర సాగు చేస్తే సుమారు నాలుగు క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ఇంకొందరికి ఆ దిగుబడి కూడా రాలేదు. వాతావరణం అనుకూలించక ఈ పరిస్థితి ఎదురైంది. క్వింటాకు రూ.8,500 వస్తుందనుకుంటే రూ.8,200 మాత్రమే రావడంతో నష్టపోయా.

– బందారు వీరభద్రం, కొణిజర్ల

**ప్రభుత్వం కొనుగోలు చేస్తే బాగుండు**



ప్రభుత్వం పెసలను కొనుగోలు చేస్తే కనీస మద్దతు ధర లభించేది. అలా జరగకపోవడంతో వ్యాపారులు చెప్పిన ధరకే అమ్మక తప్పలేదు. పెసలు నాణ్యతగా ఉన్నా రూ.8 వేలకు మించి అడగటం లేదు. ఇకనైనా ప్రభుత్వం కొనుగోలు చేస్తే రైతులకు ప్రయోజనం ఉంటుంది.

– జక్కి యాకయ్య, ముదిగొండ మండలం

## పదోన్నతితోపాటు పెన్షన్ స్కీం అమలు చేయాలి


మాట్లాడుతున్న మోహన్‌రెడ్డి, పక్కన యూనియన్ నాయకులు

**ముదిగొండ:** విద్యుత్ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించడమే కాక పెన్షన్ స్కీం అమలు చేయాలని తెలంగాణ రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల సంఘం గౌరవ అధ్యక్షుడు గాదె మోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ముదిగొండలో ఐఎన్‌టీయూసీ అనుబంధ ఖమ్మం రూరల్ సబ్ డివిజన్ కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో మోహన్‌రెడ్డి మాట్లాడుతూ యూనియన్‌లో కష్టపడి పనిచేసేవారికి గుర్తింపు ఉంటుందని తెలిపారు. కాగా, ప్రభుత్వం ఉద్యోగులకు పెన్షన్ స్కీం అమలుచేయడమే కాక ప్రతీ సెక్షన్‌కు నాలుగు పోస్టులు మంజూరు చేయాలని, ఆర్టిజన్లకు ఏపీఎస్ఈబీ సర్వీస్ రూల్స్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులుగా ఎస్.కే.దావూద్, వెంకటరామారావును ఎన్నుకున్నారు. ఈసమావేశంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మందాటి సత్యనారాయణరెడ్డి, ఊటుకూరి సీతారాంగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## తాలిపేరుకు కొనసాగుతున్న వరద


చర్ల: తాలిపేరు వంతెన వద్ద గోదావరి ప్రవాహం

**చర్ల:** మండలంలోని తాలిపేరు మధ్యతరహా ప్రాజెక్టుకు వరద ఉధృతి కొనసాగుతోంది. ప్రాజెక్టు ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా వరద వచ్చి చేరుతుండడంతో ప్రాజెక్టు 25 గేట్లలో 23 గేట్లను రెండు అడుగుల చొప్పున, మిగతావి నాలుగు అడుగుల చొప్పున ఎత్తి దిగువకు 35,526 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 74 మీటర్లు కాగా, వరదను పరిగణనలోకి తీసుకుని 73.15 మీటర్లుగా క్రమబద్ధీకరిస్తున్నారు. కాగా, శుక్రవారం ఉదయం ప్రాజెక్టు వద్ద 20 మి.మీ. వర్షపాతం నమోదైంది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో భారీ వర్షాలు కొనసాగుతున్నందున ప్రాజెక్టులోకి వరద చేరే అవకాశముందని డీఈ తిరుపతి తెలిపారు.

**పెరుగుతున్న గోదావరి నీటిమట్టం**

చర్ల మండలంలో గోదావరి నీటిమట్టం క్రమేపీ పెరుగుతోంది. గోదావరి ఎగువన ఉన్న మహారాష్ట్రతో పాటు తాలిపేరు ప్రాజెక్టు ఎగువన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో భారీగా వర్షాలు కురుస్తుండగా వరద వచ్చి చేరుతోంది. ఇక నాలుగు రోజుల నుంచి తాలిపేరు ప్రాజెక్టు ద్వారా 70 నుంచి 80 వేల మేర క్యూసెక్కుల వరద విడుదల చేస్తుండడంతో గోదావరి నీటిమట్టం పెరుగుతోంది. మండలంలోని తేగడలో తాలిపేరు హైలెవల్ వంతెనపై సుమారు 7 అడుగుల మేర వరద నీరు ప్రవహిస్తోంది.

**భద్రాచలం వద్ద తగ్గుముఖం**

**భద్రాచలంటౌన్:** గోదావరి ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో భద్రాచలం వద్ద శుక్రవారం సాయంత్రం వరకు పెరిగిన గోదావరి పెరిగింది. అయితే, రాత్రయ్యే సరికి వరద తగ్గుముఖం పట్టింది. ఎగువ ప్రాజెక్టుల నుంచి వచ్చే భారీ వరదతో భద్రాచలం వద్ద 33.9 అడుగులకు చేరిన గోదావరి సుమారు అడుగు తగ్గి రాత్రి 8 గంటలకు 32.8 అడుగులకు పడిపోయింది. ఎగువ ప్రాంత ప్రాజెక్టుల నుంచి తక్కువగానే వరద వసుస్తుండడంతో గోదావరి కూడా మరింత తగ్గే అవకాశముందని అధికారులు భావిస్తున్నారు.

**కిన్నెరసాని జలాశయానికి....**

**పాల్వంచరూరల్:** పాల్వంచ మండలంలోని కిన్నెరసాని జలాశయంలోకి వరద కొనసాగుతోంది. 407 అడుగుల నీటి నిల్వ సామర్థ్యం కలిగిన కిన్నెరసాని జలాశయంలోకి 200 క్యూసెక్కుల వరద చేరడంతో శుక్రవారం నీటిమట్టం 405.60 అడుగులకు చేరిందని డ్యామ్‌సైడ్ పర్యవేక్షక ఇంజనీర్ సురేశ్ తెలిపారు. వరద మరింత పెరిగితే గేట్లను ఎత్తనున్నందున లోతట్టు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు.

## దేశం గర్వించదగిన ఇంజనీర్ విశ్వేశ్వరయ్య


విశ్వేశ్వరయ్య జయంతి వేడుకల్లో పాల్గొన్న సింగరేణి డైరెక్టర్లు, అధికారులు

**సింగరేణి(కొత్తగూడెం):** భారతదేశం గర్వించదగిన ఇంజనీర్, భారతరత్న పురస్కార గ్రహీత మోక్షగుండం విశ్వేశ్వరయ్య అని సింగరేణి డైరెక్టర్లు ఎన్వీకే శ్రీనివాస్, వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట విశ్వేశ్వరయ్య విగ్రహానికి ఆయన జయంతి సందర్భంగా వారు నివాళులర్పించి మాట్లాడారు. బ్రిటీష్ కాలంలోనే ఆయన ఇంజనీర్‌గా అత్యున్నత విజయాలు సాధించారని తెలిపారు. అలాగే, విశ్వేశ్వరయ్య హయాంలో రూపుదిద్దుకున్న ప్రాజెక్టులు ఈనాటికీ నిలిచిపోయాయని చెప్పారు. కార్యక్రమంలో వివిధ విభాగాల అధికారులు కట్టా బసవయ్య, సూర్యనారాయణ, ఎం.సుబ్బారావు, జి.వెంకటరమణ, బీహెచ్ వెంకటేశ్వరరావు, జి.మోహన్‌రెడ్డి, ఎస్.జగన్‌మోహన్‌రావు, జి.కమలాకర్‌భూషణ్, సీహెచ్ నవీన్‌కుమార్, జి.జానకీరామయ్య, జి.నాగేశ్వరరావు, ఎస్.వెంకటేశ్వరరావు, ఎ.రవికుమార్, డి.లలిత్‌కుమార్, రాజశేఖర్, రవికుమార్ పాల్గొన్నారు.

## అయ్యప్ప ఆలయానికి రూ.10 లక్షలు విరాళం


ఆలయ నిర్వాహకులతో పుల్లారెడ్డి కుమారులు

**తల్లాడ:** తల్లాడ మండలం కుర్నవల్లిలోని అయ్యప్ప దేవాలయ నిర్వహణ నిమిత్తం తమ తల్లిదండ్రుల పేరిట కుమారులు రూ.10 లక్షలు విరాళం అందజేశారు. కుర్నవల్లిలో స్థానికులు కమిటీగా ఏర్పడి అయ్యప్ప ఆలయాన్ని నిర్మించారు. ఈనేపథ్యాన ఆలయ నిర్వహణ కోసం గ్రామానికి చెందిన అన్నెం పుల్లారెడ్డి-సీతమ్మ దంపతుల పేరిట వారి కుమారులు అన్నెం నాగిరెడ్డి, కృష్ణారెడ్డి, వెంకట్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, కోటారెడ్డి శుక్రవారం రూ.10 లక్షలు అందజేశారు. కార్యక్రమంలో అన్నెం వెంకటేశ్వర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, శాఖంరెడ్డి బుచ్చిరెడ్డి, కర్నాటి రామిరెడ్డి, బోడేపూడి పూర్ణచందర్‌రావు, వేమిరెడ్డి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.